ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
శుక్రవారం 22 మార్చి 2024

రంజాన్ వేళలు
ఇఫ్తార్ - శుక్రవారం
సాయంత్రం - 6.34
సహర్ - శనివారం
ఉదయం - 4.56



వికారాబాద్ మండలంలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

ఉపాధి.. ఉరకలు

లక్ష్యానికి చేరువలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పనులు

జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా స్థానికంగానే కూలీలకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) పనులు జిల్లాలో వేగం పుంజుకున్నాయి. పెరుగుతున్న ఎండల తీవ్రత ప్రభావం ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలపై పడకుండా ముందు గానే లక్ష్యం చేరుకునే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. గత సీజన్లతో పోల్చుకుంటే ఈ ఏడాది ఈ సమయంలో జిల్లాలో ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య భారీగా పెరిగింది.

- జిల్లాకు 62,83,158 పని రోజుల లక్ష్యం
- ఇప్పటి వరకు 57,13,609 పని రోజులు పూర్తి
- ఇంకా 5,69,549 పని రోజులు పూర్తి చేయాల్సిన లక్ష్యం
- ఈ నెలాఖరు వరకు గడువు


వికారాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉపాధి హామీ పథకం(ఎంజీఎన్ఆర్ఈజీఎస్) పనులు జిల్లాలో వేగం పుంజుకున్నాయి. రోజు రోజుకూ పెరుగుతున్న ఎండ తీవ్రత ప్రభావం ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలపై పడకుండా ముందుగానే లక్ష్యం చేరుకునే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. గత సీజన్లతో పోల్చుకుంటే ఈ ఏడాది ఈ సమయంలో జిల్లాలో ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య పెరుగుతుండం విశేషం. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఉపాధి హామీ పథకం కూలీలకు 62,83,158 రోజుల పని కల్పించాలనే లక్ష్యం ఉండగా, ఈ నెల 18వ తేదీ వరకు 57,13,609 పని రోజుల ఉపాధి కల్పించారు. నిర్దేశించిన లక్ష్యంలో ఇంకా 5,69,549 పని రోజులు పూర్తి చేయాల్సి ఉన్నది. జిల్లాకు కేటాయించిన పని రోజుల లక్ష్యంలో ఇప్పటి వరకు 90.93 శాతం పూర్తి చేయగలిగారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో 13 రోజుల గడువు ఉంది. ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య పెరిగేలా కృషి చేయాలని కలెక్టర్ ఇటీవల నిర్వహించిన సమీక్షలోనూ సంబంధిత అధికారులకు సూచించిన విషయం తెలిసిందే. గడువు ముగిసే లోగా జిల్లాకు నిర్దేశించిన ఉపాధి పని రోజుల లక్ష్యాన్ని అధిగమిస్తారా? లేదా? అనేది వేచి చూడాల్సి ఉంది.

ఉన్న చోటనే పని..

గ్రామీణ ప్రాంతాల్లో కూలీలు, వ్యవసాయ కూలీలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా స్థానికంగానే వారికి పనులు కల్పించాలనేది ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. ఈ పథకం కింద జాబ్ కార్డు పొందిన ప్రతి కుటుంబానికి ఏడాదిలో వంద రోజులు పని కల్పించాలి. జిల్లాకు కేటాయించిన ఉపాధి పని రోజుల లక్ష్యం అధిగమించే దిశగా ప్రారంభం నుంచే పర్యవేక్షణ కొనసాగుతూ వచ్చింది. ఉపాధి హామీ పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించిన జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తూ లక్ష్యానికి చేరువ చేయగలిగారు. వ్యవసాయం, వ్యవసాయేతర పనులు తక్కువగా ఉండే వేసవి సీజన్‌లో కూలీలు ఎక్కువ సంఖ్యలో ఉపాధి హామీ పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నా.. కూలీల సంఖ్య ఆశించిన స్థాయిలో ఇంకా పెరగాల్సి ఉంది. కాగా, ఉపాధి పనులకు ఎక్కువ మంది కూలీలు హాజరవుతున్న జిల్లాల్లో వికారాబాద్ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండడం విశేషం. ఎక్కువ సంఖ్యలో కూలీలు ఉపాధి పనులకు హాజరైతే ఈ నెలాఖరులోగా కూలీలకు ఎక్కువ పని రోజులు ఉపాధి కల్పించగలుగుతారు.

ఉపాధి పనుల్లో మేటి!

ఉపాధి హామీ పనులకు హాజరవుతున్న కూలీల్లో ఎక్కువగా వికారాబాద్ జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో కొనసాగుతోంది. ప్రస్తుతం జిల్లాలో ఉపాధి పనులకు 44,744 మంది కూలీలు హాజరవుతున్నారు. మిగతా జిల్లాలతో పోల్చుకుంటే వికారాబాద్ జిల్లాలోనే కూలీలు ఎక్కువ సంఖ్యలో పనులకు హాజరు అవుతుండడం విశేషం. ఎక్కువ కుటుంబాలకు పని కల్పించడంలోనూ జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. సరాసరిగా 55.56శాతం కుటుంబాలకు ఉపాధి కల్పించగలిగారు. కూలి(వేతనం) కింద ఎక్కువ డబ్బు వెచ్చించడంలో జిల్లా మూడో స్థానంలో ఉంది. పనిరోజుల పూర్తిలో 3వ స్థానంలో, ఎక్కువ కుటుంబాలు వంద రోజులు పనిచేసిన అంశంలో రాష్ట్రంలో 4వ స్థానంలో నిలిచింది.





మరో 10 రోజులు హాజరైతే...

ప్రస్తుతం పనులకు హాజరవుతున్న కూలీలు మరో 10 రోజుల పాటు హాజరైనా జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని అధిగమించగలుగుతారు. జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లోని 566 గ్రామ పంచాయతీల పరిధిలో 1,82,794 ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉండగా, ఈ కార్డుల్లో 3,75,638 మంది కూలీలు నమోదయ్యారు. జాబ్ కార్డుల్లో 1,81,090 కార్డుల్లో నమోదైన 1.34లక్షలు యాక్టివ్ జాబ్ కార్డులు ఉండగా, వాటిలో 2.54లక్షల మది పనులకు హాజరయ్యే కూలీలు ఉన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఉపాధిహామీ పనులకు 43,861 మంది కూలీలు క్రమం తప్పకుండా హాజరవుతున్నారు. ఈ నెలాఖరు వరకు కూలీల సంఖ్య కనీసం 50వేల మదికిపైగా పెరిగేలా సంబంధిత అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 4,849 కుటుంబాలు వంద రోజుల పని దినాలను పూర్తి చేసుకున్నాయి. జిల్లాలో ప్రతీ కూలీ సరాసరి వేతనంగా రూ.186.96 పొందుతున్నారు. ఈ ఏడాది ఇంత వరకు రూ.106.82 కోట్ల విలువైన పని రోజులు పూర్తి చేశారు.

చేవెళ్లకు రంజిత్.. మల్కాజిగిరికి సునీత

లోక్‌సభ అభ్యర్థుల ఖరారు ▸ జాబితా విడుదల చేసిన కాంగ్రెస్





రంగారెడ్డి అర్బన్, మార్చి 21 : రాజకీయ వర్గాలు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న తెలంగాణ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థుల కీలక జాబితా ఎట్టకేలకు విడుదలైంది. దేశవ్యాప్తంగా మొత్తం 57 మందితో కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థుల మూడో జాబితా విడుదల చేయగా.. తెలంగాణలోని మరో 5 స్థానాలకు అభ్యర్థులను గురువారం ప్రకటించింది. ఇందులో భాగంగా చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా గడ్డం రంజిత్ రెడ్డి పేరును ఖరారు చేసింది. అలాగే మల్కాజ్‌గిరి నుంచి వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి పేరును ఖరారు చేసింది. కాగా, చేవెళ్ల పార్లమెంట్ టికెట్ కోసం ఈ ఇరువురూ పోటీపడ్డారు. టికెట్ ఆశించిన వారిద్దరూ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. అయితే, వారిద్దరిలో టికెట్ ఎవరికి ఇవ్వాలనే విషయంపై గందరగోళ పరిస్థితులు ఏర్పడగా.. చివరకు చేవెళ్ల ఎంపీ టికెట్ రంజిత్‌రెడ్డికి ఇవ్వాలని పార్టీ అధిష్టానం నిర్ణయించింది. మల్కాజ్‌గిరి ఎంపీ టికెట్ సునీతా మహేందర్‌రెడ్డికి కట్టబెట్టింది. కాగా, ముందు నుంచీ 'ఆంధ్రజ్యోతి' చెప్పినట్టుగానే చేవెళ్ల, మల్కాజ్‌గిరి టికెట్లు రంజిత్‌రెడ్డి, సునీతారెడ్డికి దక్కాయి.

బాలామృతం పిల్లలకు వరం లాంటిది



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అన్నప్రాసన చేస్తున్న ఐసీడీఎస్ పీడీ కృష్ణారెడ్డి

శామీర్‌పేట, మార్చి 21 : పిల్లల సంక్షేమం కోసం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బాలామృతం వరం లాంటిదని మేడ్చల్ జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణారెడ్డి అన్నారు. శామీర్‌పేటలోని నాల్గో నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం పెద్దఎత్తున పోషణ వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ చిన్నారులకు ఐసీడీఎస్‌పీడీ ద్వారా అన్నప్రాసన చేశారు. అదే విధంగా పిల్లలకు బాలామృతాన్ని తినిపించారు. గర్భిణులకు అంగన్‌వాడీ టీచర్లు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ స్కూళ్లలోనే పౌష్టికాహారాన్ని అందిస్తోందని తెలిపారు. అంగన్‌వాడీ తల్లులు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నిత్యం బాలామృతాన్ని తప్పనిసరిగా తినిపించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పద్మమ్మ, రేణుక, అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, శకుంతల, పావని, భవాని, అంగన్‌వాడీ తల్లులు పాల్గొన్నారు.



మల్లికార్జునస్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న ఒగ్గు కళాకారులు

కనుల పండువగా శ్రీ మల్లికార్జునుడి కల్యాణోత్సవం

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 21 : మండల పరిధి ప్రతాప్‌సింగారంలో గురువారం శ్రీ మల్లికార్జునస్వామి కల్యాణాన్ని కనుల పండువగా జరిపించారు. మల్లికార్జునస్వామి-కేతమ్మ, బౌరమ్మలను ఒగ్గు కళాకారులు ముస్తాబు చేశారు. ఆలయ ప్రాంగణంలో టెంట్లు వేసి ఏర్పాట్లు చేశారు. డోలు వాయిద్యాలు, మంత్రోశ్చరణల మధ్య అమ్మవార్లకు మల్లికార్జునస్వామిచే జీలకరబెల్లం, మాంగళ్యధారణ కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవార్లకు భక్తులు కట్నకానుకలు, వొడిబియ్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. యాదవసంఘం ఆధ్వర్యంలో బాలగోని నర్సింహ, ఎల్లయ్య, ఆంజయ్య, మల్లేష్, రవి, చంద్రమౌళి తదితరులు వేడుకలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి-చంద్రకళ దంపతులు స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌గౌడ్, కుమార్, చంద్రశేఖర్, జంగయ్య, బాలకృష్ణ, వెంకటేష్, మహంకాళి, మహిళలు పాల్గొన్నారు.

ఆశాజనకంగా జొన్న సాగు

- వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలపై రైతుల దృష్టి
- ధర కూడా బాగానే ఉండడంతో 8వేల ఎకరాల్లో సాగైన జొన్న

పరిగి, మార్చి 21: కలిసి రాని వానకాలం రైతులకు నష్టాలను మిగిల్చింది. యాసంగి సాగుకు నీటి సమస్య తలెత్తడంతో రైతులు సంప్రదాయ పంటలకు స్వస్తి పలికి ప్రత్యామ్నాయ సాగుపై దృష్టి సారిస్తున్నారు. ప్రధానంగా వానకాలంలో సాగయ్యే జొన్న పంట ఇప్పుడు యాసంగి సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. వరిసాగు చేసినా నీరందదని రైతులు తక్కువ నీరు, తక్కువ పంట కాలం ఉండే పంటలపై దృష్టిసారించారు. రైతులు ఆరు తడి పంటల్లో భాగంగా జొన్న సాగు చేస్తున్నారు. అలాగే కొందరు వ్యాధుల దృష్ట్యా, బరువు పెరగకుండా ఉండేందుకు అన్నానికి బదులు జొన్న రొట్టెల తింటుండడంతో డిమాండ్ పెరిగింది. దీంతో పజొన్నలు, తెల్లజొన్నలకు మార్కెట్‌లో రేటు కూడా బాగానే ఉందని రైతులు ఆ పంటపై దృష్టి సారిస్తున్నారు. సన్న బియ్యం కంటే కూడా జొన్నల ధర ఎక్కువగా ఉంది. హైబ్రిడ్ విత్తనాలు ఏ సీజన్‌లో సాగు చేసినా దిగుబడి బాగానే వస్తుండడంతో జొన్న సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలోని 18 మండలాల్లో 8వేల ఎకరాల్లో జొన్న సాగు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. చెరువుల కింద, బోర్ల కింద సాగుచేసిన జొన్న పంటకు పరిస్థితులు అనువుగా ఉన్నాయి. వేసిన పంట ఏపుగా పెరిగింది. పంట ప్రస్తుతం గింజ బలెపట్టె దశలో ఉంది. పది, పన్నెండు రోజుల్లో గింజ గట్టి పడుతుంది. మరో రెండు నీటి తడులతో పంట గట్టెక్కుతుంది.



పరిగి మండలం చిట్యాలలో సాగు చేసిన జొన్న పంట

పిట్టలు, అడవి పందుల బెడదతో రైతుల ఆందోళన

జొన్న పంట చేతికొస్తున్న సమయంలో పిట్టలు, పందుల బెడదతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం జొన్న కంకులు పాలు పోసుకుంటున్నాయి. ఈ సమయంలో పిట్టలు, పందులు వస్తున్నాయని వాపోతున్నారు. పగలంతా పిట్టల కావలి, రాత్రంతా అడవి పందులు కాపలా కాయాల్సి వస్తోందన్నారు. జొన్నపంట ఆశాజనకంగా ఉన్నా పందులు, పిట్టల బెడడతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. మరో రెండు తడులు సరిపోతాయని, పక్షం రోజుల్లో పంట కోతకొస్తుందని రైతులు చెబుతున్నారు.



రెండు వారాలైతే పంట చేతికి

యాసంగి సీజన్ జొన్న పంట సాగుకు అనకూలంగా ఉంటుంది. బోర్లలో నీరు తగ్గుతుందని మాకు తెలుసు. అందుకే వరికి బదులు జొన్న వేశాం. పంట కూడా బాగానే ఉంది. రెండు వారాలైతే పంట చేతికొస్తుంది. పంట పెట్టుబడి కూడా తక్కువే. అయితే పిట్టల బెడద మాత్రం ఉంది. ఎలాగోలా మరో 15రోజులు పంటను కాపాడుకోవాల్సి ఉంది.

- ఆంజనేయులు రైతు, చిట్యాల్

సైబర్ ఉచ్చులో మమ్మదాన్‌పల్లి



పే యాప్‌లో పెట్టుబడి పెట్టి లక్షల్లో మోసపోయిన అమాయకులు

- 100 మంది వరకు బాధితులు
- గ్రామస్తులను రూ.80లక్షల వరకు ముంచిన ఆన్‌లైన్ యాప్
- పూలపల్లిలోనూ 20 మంది బాధితులు.. రూ.5లక్షల వరకు మోసం

వికారాబాద్, మార్చి 21: ఒకరు కాదు.. ఇద్దరు కాదు ఏకంగా వందలాది మంది గ్రామస్తులు సైబర్ ఉచ్చులో పడి మోసపోయారు. భారీగా లాభాల ఆశచూపి పెట్టుబడి పెట్టించుకొని ఓ పేయాప్ కేటుగాళ్లు అమాయకులను లక్షల్లో దోచుకున్నారు. మొదట తక్కువ మొత్తంలో లాభాలిచ్చి తరువాత పెద్దమొత్తంలో దండుకొని యాప్‌ను మూసేశారు. రాష్ట్రంలో అక్కడక్కడ వినిపించే ఈ పేయాప్ ఇప్పుడు వికారాబాద్ జిల్లాలో కలకలం రేపుతోంది. ఏకంగా ఓ గ్రామమే సైబర్ ఉచ్చులో కూరుకుంది. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం మమ్మదాన్‌పల్లి వాసులు పేయాప్ ఉచ్చులోపడి లక్షల్లో నష్టపోయారు. యువత, చిరు వ్యాపారులు, ఉద్యోగులను టార్గెట్ చేసుకుని సైబర్ కేటుగాళ్లు లక్షల్లో దోచుకున్నారు. మొదట రోజూ వేలల్లో లాభం ఖాతాల్లో వేసి ఎర వేసి ఒక్కొక్కరి నుంచి లక్షల్లో పెట్టుబడి పెట్టించారు. గ్రామం నుంచి వేక్ యాప్ పెట్టుబడితో ఏకంగా రూ.80లక్షల వరకు మోసపోయి లబోదిబోమంటున్నారు. గ్రామంలో రూ.3వేల నుంచి రూ.2లక్షల వరకు పెట్టుబడి పెట్టిన వారు 100 మంది వరకు ఉన్నారు. యాప్‌లో పెట్టుబడిపెట్టి మోసపోయామని చెప్పుకుంటే తమకే సిగ్గుచేటని కొందరు బయటకు చెప్పడం లేదు. మరికొందరు ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతం అవుతున్నారు.

చైన్ సిస్టంతో పెట్టుబడుల ఆకర్షణ

ఒకరి ద్వారా మరొకరు వేక్ యాప్ బారినపడ్డారు. మొదట మమ్మదాన్‌పల్లికి చెందిన ఓ యువకుడు ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తుండగా అతడి స్నేహితుడు వేక్ యాప్‌లో పెట్టుబడి పెడితే పెట్టుబడిపై 42రోజుల్లో 15శాతం ఆదాయం అదనంగా వస్తుందని చెప్పాడు. దీంతో ఆ యువకుడు వేక్‌యాప్‌ను తన ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకొని పెట్టుబడి పెట్టాడు. గ్రామంలో మరికొందరు యువకులతో పెట్టించాడు. జనవరిలో పెట్టుబడి పెట్టిన వారు ఒక్కొక్కరికి రూ.40వేల వరకు ఆదాయం వచ్చింది.

పెద్ద మొత్తం పెట్టుబడి... యాప్ క్లోస్!

తక్కువ పెట్టుబడి పెట్టిన సమయంలో యాప్ నిర్వాహకులు లాభాలు చెల్లించారు. పెద్ద మొత్తంలో పెట్టుబడి పెడితే మరింత ఆదాయం వస్తుందని ఆశచూపారు. పెద్ద మొత్తం పెట్టుబడి పెట్టగానే యాప్ మూసేశారు. మొదట్లో డబ్బు రావడం, విత్ డ్రా చేసుకోవడం బాగానే ఉండడంతో నమ్మి గ్రామంలో చిన్నాపెద్ద అనే తేడా లేకుండా ఎక్కువ మందే పెట్టుబడి పెట్టారు. అమెరికాలోని న్యూయార్క్‌లో గోల్డ్‌మేళా కొనసాగుతోందని, అందుకే ఎక్కువ పెట్టుబడులకు ఎక్కువ లాభాలు ఇస్తున్నామని పేర్కొంటూ యాప్ నిర్వాహకులు నమ్మించారు. గ్రామస్తులు లక్షల్లో పెట్టుబడి పెట్టారు. రూ.90వేలు చెల్లిస్తే రూ.9లక్షలు వస్తాయని చెప్పడంతో చెల్లించుకున్నారు. కొందరు భార్యాభర్తలు సైతం ఖాతా తెరిచి చెల్లించారు. కొందరు భార్యాభర్తలు వారి ఫోన్‌ల నుంచి రూ.90వేల చొప్పున 1.8లక్షలు చెల్లించారు.




వేక్ యాప్ అప్లికేషన్ ఫొటోలు

ఆశకు పోయి అప్పులపాలైన యువత

మొదట్లో లాభం రావడంతో పెద్దమొత్తంలో పెట్టుబడి పెట్టి యువకులు మోసపోయారు. చిన్న మొత్తంలో పెట్టుబడి పెట్టిన వారికి యాప్‌లో డబ్బులు రావడంతో నమ్మి ఎక్కువ పెట్టుబడి పెట్టారు. గ్రామంలోని ప్రతీ కుటుంబంలో కనీసం ఒక్కరైనా ఈ యాప్‌లో పెట్టుబడి పెట్టారు. కొందరు లక్షల్లో పెట్టగా.. డబ్బులులేని వారు 10శాతం వడ్డీకి తెచ్చి మరీ పెట్టుబడిపెట్టారు. మోసపోయిన వారు కన్నీటి పర్యంతమవుతున్నారు. బయట చెప్పుకుంటే తమ పరువే పోతుందని కొందరు పెద్దవారు తామేమీ పెట్టలేదన్నట్టు ఉంటున్నారు. కొందరు డబ్బు రాబట్టుకునేందుకు ఎవరిని ఆశ్రయించాలో చర్చించుకుంటున్నారు. అయితే వేక్‌యాప్ మమ్మదాన్‌పల్లిలోనే కాకుండా వేరే గ్రామాల్లోనూ విస్తరించింది. పూలపల్లిలో 20 మంది రూ.5లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. అలాగే కామారెడ్డిగూడ, పాతూరుల్లోనూ కొందరు పెట్టుబడి పెట్టారు. ఈ యాప్‌లో మోసపోయిన వారి ఉదంతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకొస్తున్నాయి. ఈ యాప్‌పై పోలీసులు ప్రచారం నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.


రూ.6వేలు మోసపోయా..



వేక్ యాప్‌లో డబ్బుపెడితే ఎక్కువ లాభమొస్తుందని నేను రూ.6వేలు పెట్టాను. ఇప్పటి వరకు నాకు డబ్బులు రాలేదు. యాప్ ప్రస్తుతం ఓపెనే కావడం లేదు. గ్రామంలో ఎవరిని అడిగినా తామూ మోసపోయామని చెబుతున్నారు.

- అశోక్, మమ్మదాన్‌పల్లి

రూ.50వేలు పోగొట్టుకున్నా..



మా గ్రామానికి చెందిన వ్యక్తి ద్వారా యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నా. మొదట్లో తక్కువ పెట్టుబడి పెట్టి నేను రూ.40వేల వరకు డ్రా చేసుకున్నా. రూ.90వేలు పెడితే రూ.9లక్షలు వస్తాయని మెసేజ్‌లు పెట్టారు. చాలా మంది పెట్టుబడిపెట్టారు. ఈ నెల 7వ తేదీ నుంచి యాప్ ఓపెన్ కావడం లేదు. నేను రూ.50వేలు పోగొట్టుకున్నా.

- అరవింద్, మమ్మదాన్‌పల్లి

వైభవంగా కోటచింతల బసవేశ్వరస్వామి జాతర

కులకచర్ల, మార్చి 21: చౌడాపూర్ మండలం మరికల్, కిష్టంపల్లి గ్రామ పరిధిలోని శ్రీకోటచింతల బసవేశ్వరస్వామి జాతర ఉత్సవాలను గత నాలుగు రోజులుగా అత్యంత వైభవంగా నిర్వహించారు. గురువారం పూజారి మఠం సిద్దయ్య ఆధ్వర్యంలో తెల్లవారుజామున అగ్నిగుండం, రథోత్సవ కార్యక్రమాలు, శ్రీ శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు నర్సింహారెడ్డి, పాండురంగయ్య, సత్యకుమార్, శ్రీనివాసులు, దామోదర్, నరేందర్, శివుడు, మల్లికార్జున్, ప్రభులింగం, రమేశ్, రాజేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.


మరికల్ కోటచింతల ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

ఏసీబీ వలలో తూనికలు, కొలతలశాఖ జిల్లా అధికారి



రూ.10వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన ఉమారాణి, మల్లేశం

కొత్తూర్, మార్చి 21(ఆంధ్ర జ్యోతి): తూనికలు, కొలతల శాఖ రంగారెడ్డి జిల్లా ఇన్‌స్పెక్టర్ సింగబోయిన ఉమారాణి, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ డి. మల్లేశంలు రూ.10 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)కు చిక్కారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూర్ సమీపంలోని నాట్కో పరిశ్రమ ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషన్ల నిర్వహణ కాంట్రాక్టును యాజమాన్యం తూనికలు, కొలతల శాఖ లైసెన్స్ ఉన్న ఎస్.గిరిధర్‌రావుకు అప్పగించింది. వెయింగ్ మిషన్లకు ప్రతి సంవత్సరం స్టాంపింగ్ వేయాలి. ఈ క్రమంలో వాటి స్టాంపింగ్ కోసం గిరిధర్‌రావు జిల్లా తూనికలు, కొలతల కార్యాలయం అధికారులను ఆశ్రయించారు. అయితే అందుకు రూ.10 వేలు ఇవ్వాలని ఉమారాణి డిమాండ్ చేశారు. దాంతో గిరిధర్‌రావు ఏసీబీ అధికారులను ఆశ్రయించి వారి సూచన మేరకు గురువారం రూ.10 వేలు తీసుకొని కార్యాలయానికి వెళ్లారు. ఉమారాణి ఆదేశం మేరకు ఆ డబ్బును మల్లేశంకు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితులు ఇద్దరిని అరెస్టు చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టారు.



మాట్లాడుతున్న సీడీపీవో నాగమణి

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

▸ సీడీపీవో నాగమణి

కేశంపేట, మార్చి 21 : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, పోషక విలువలతో కూడిన ఆహారన్ని ప్రతీ ఒక్కరూ తీసుకోవాలని షాద్‌నగర్ సీడీపీవో నాగమణి సూచించారు. మండల పరిధిలోని కొత్తపేట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీడీపీవో హాజరై బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలనుద్దేశించి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ చిరుధాన్యాలు ఆహారంలో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు పట్టించాలని అన్నారు. చిన్నారుల ఆరోగ్యంపట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శమంత, విజయలక్ష్మీ, దివ్యాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా.. 'పది' పరీక్షలు

రంగారెడ్డి అర్బన్, మార్చి 21 : జిల్లాలో పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా కొనసాగుతున్నాయి. గురువారం నిర్వహించిన మూడో పేపర్.. ఇంగ్లీష్ పరీక్షకు జిల్లావ్యాప్తంగా 50,895 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా.. 50,744 మంది హాజరయ్యారు. మిగతా 151 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. హాజరు 99.70 శాతం నమోదైంది. అలాగే ప్రైవేట్ విద్యార్థులకు సంబంధించి 93 మంది విద్యార్థులకుగాను 76 మంది పరీక్ష రాశారు. 17మంది విద్యార్థులు హాజరు కాలేకపోయారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ 68 మంది పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా తగిన చర్యలు తీసుకున్నారు.

ముగిసిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

▸ చివరి రోజు వైభవంగా కల్యాణోత్సవం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు



కల్యాణ ఉత్సవంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు, టీటీడీబోర్డు మెంబర్ సీతారెడ్డి

పరిగి, మార్చి 21: పరిగిలో మూడు రోజులుగా జరుగుతున్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. మూడు రోజుల పాటు ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. చివరి రోజు గురువారం ఉదయం వేద పారాయణం, స్వామివారికి అభిషేకాలు, శ్రీలక్ష్మీ హోమం, శ్రీవెంకటేశం, శ్రీఆంజనేయ, నాగధ్వజహోమాలు, మహాపూర్ణాహుతి నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి దంపతులు కూర్చుని జరిపించారు. కల్యాణోత్సవానికి పట్టణ ప్రజలే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. సాయంత్రం స్వామివారి పల్లకీసేవ నిర్వహించారు. పట్టణంలో ఆట, పాటలు, భజనల మధ్య స్వామివారిని ఊరేగించారు. భక్తులందరికీ అన్నదానం చేశారు. ఉత్సవాల సందర్భంగా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాల, పెద్దలతో ఆధ్యాత్మిక ప్రవచనాలను నిర్వహించారు. మూడు రోజులపాటు భక్తులకు ఏర్పాట్లు, నీళ్ల, భోజనాలపై నిర్వాహకులు దగ్గరుండి పర్యవేక్షించారు. చివరిరోజు తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి సతీమణి, టీటీడీ బోర్డు మెంబర్ సీతారెడ్డిలు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో పురోహితులు సిద్ధాంతి పార్థసారథి, రేపల్లి రాజుశర్మ, ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌పీ బాబయ్య, బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్, ఎంపీపీ సత్తమ్మ, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణ, భీంరెడ్డి, కార్యదర్శులు కె.హన్మంత్, వైస్‌ఎంపీపీ కె.సత్యనారాయణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, పరిగి, పూడూరు, కులకచర్ల మండలాల పార్టీ అధ్యక్షుడు బి.పరుశరాంరెడ్డి, బీఎస్ ఆంజనేయులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా వేంకటేశ్వరస్వామి ఆలయ ముఖ ద్వారాన్ని నిర్మిస్తామని జడ్పీటీసీ బి.హరిప్రియ ప్రవీణ్‌రెడ్డి తన తల్లిదండ్రులు యశోదమ్మ, గోపాల్‌రెడ్డి ప్రకటించారు.

కేంద్రంలో మూడోసారీ బీజేపీ ప్రభుత్వమే



మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న కోట మర్పల్లి నాయకులు

మర్పల్లి, మార్చి 21: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వస్తుందని చేవెళ్ల మాజీ ఎంపీ, ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మర్పల్లి మండలంలోని కోట మర్పల్లి గ్రామంలో గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, యువకులు గురువారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీకి దేశంలోనే కాకుండా ప్రపంచ దేశాల్లో ఎంతో ఆదరణ ఉందన్నారు. ఎక్కడ చూసినా బీజేపీ ప్రభుత్వ అభివృద్ధే కనిపిస్తోందన్నారు. గతంలో తాను ఎంపీగా ఉన్న సమయంలో మర్పల్లి మండల అభివృద్ధికి రూ.40లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఒకప్పుడు దేశాన్ని చిన్న చూపు చూసిన దేశాలన్నీ ప్రస్తుతం భారత్ సాయం కోసం ఎదురుచూస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, ఎస్సీ సెల్ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, శివరాజ్, మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ రాజకీయాలు దేశానికి ప్రమాదకరం

బంట్వారం(కోట్‌పల్లి): వారసత్వ రాజకీయాలు దేశానికి ప్రమాదకరమని బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. కోట్‌పల్లి మండల కేంద్రంలోని డీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం కోట్‌పల్లి బుగ్గాపురం, లింగంపల్లి, అన్నాసాగర్, బార్వాద్ గ్రామాలకు చెందిన ప్రతిపక్ష పార్టీలకు చెందిన సుమారుగా 300 మంది నాయకులు విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బిజెపి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొరుగు దేశాలకు ఏ అవసరం వచ్చిన వాళ్లకు గుర్తు వచ్చేది మొదటి పేరు భారత దేశం అని, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు కేవలం బీజేపీకే ఉందన్నారు. సాధ్యంకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ప్రధాని మోదీ రూ.9వేల కోట్లు సాయం చేయకుంటే ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి ఉండేదికాదన్నారు. తాను గెలుపొందితే కోట్‌పల్లి ప్రాజెక్టును అభివృద్ధి చేస్తానన్నారు. ఇటీవలే అనంతగిరి ప్రాజెక్టు అభివృద్ధికి రూ.100కోట్లు కేటాయించినట్లు గుర్తుచేశారు. మరోసారి ఎంపీ అయ్యాక ఈ ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా మారుస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రత్నం, మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, సాయిచరణ్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు గాలయ్య, జిల్లా కోశాధికారి సతీష్, పాండుగౌడ్, రాజు, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఉప్పరి రమేష్ సందీప్ మరియు సీనియర్ నాయకులు మూడు గ్రామాల ప్రజలు, కార్యకర్తలు ,అభిమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అన్ని వర్గాల వారికి కేంద్ర ప్రభుత్వ పథకాలు

చేవెళ్ల, మార్చి 21 : దేశంలో బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలతో అన్ని వర్గాల ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు అందాయని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ అత్యంత శక్తి వంతుడని కొనియాడారు. గురువారం శంకర్‌పల్లి మండల పరిధిలోని సంకేపల్లి గ్రామ మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, భద్రయ్య, వారి అనుచరులు విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగరవేయాలని కార్యకర్తలను కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకుల మాటలను ప్రజలు నమ్మొద్దన్నారు. బీజేపీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజాసేవే లక్ష్యంగా తాను ప్రజల ముందుకు వస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం, అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, సంకెపల్లి మాజీ సర్పంచ్ పరమేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు రమేశ్, ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు వైభవ్‌రెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

క్యూఆర్ కోడ్ ద్వారా రైలు టికెట్ల కొనుగోలు

ప్రయోగాత్మకంగా 14 స్టేషన్లలో 31 కౌంటర్ల ఏర్పాటు

హైదరాబాద్, మార్చి21(ఆంధ్రజ్యోతి): రైల్వేలో డిజిటల్ చెల్లింపులను పెంపొందించే చర్యల్లో భాగంగా టికెట్లను కొనుగోలు చేసేందుకు క్యూఆర్(క్విక్ రెస్పాన్స్) కోడ్ సేవల్ని దక్షిణమధ్య రైల్వే అందుబాటులోకి తెచ్చింది. దీంతో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ల వద్ద చిల్లర కోసం పడే పాట్లు తప్పనున్నాయి. మొదటి దశలో ప్రయోగాత్మకంగా సికింద్రాబాద్ డివిజన్‌లో 14 స్టేషన్లలోని 31 కౌంటర్ల ద్వారా వినియోగదారులకు ఈ నగదు రహిత లావాదేవీల సదుపాయం కల్పిస్తున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. ముఖ్యమైన సమాచారం, చార్జీలు తదితర వివరాలను సూచించే డిస్‌ప్లే బోర్డులను బుకింగ్ కౌంటర్ల వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే డిస్‌ప్లే బోర్డులో కన్పించే క్యూఆర్ కోడ్‌ను ప్రయాణికులు తమ మొబైల్ ఫోన్‌లో ఉన్న పేమెంట్ యాప్ ద్వారా స్కాన్ చేసుకుని అవసరమైన రుసుమును జమచేయాలని, తర్వాత టికెట్ జనరేట్ అవుతుందని పేర్కొన్నారు. తొలి దశలో సికింద్రాబాద్, హైదరాబాద్, కాజీపేట, బేగంపేట, వరంగల్, మంచిర్యాల్, లింగంపల్లి, హైటెక్‌సిటీ, జేమ్స్‌స్ట్రీట్, మహబూబాబాద్, బెల్లంపల్లి, ఫతేనగర్‌బ్రిడ్జ్, సిర్పూర్ కాగజ్‌నగర్, వికారాబాద్ స్టేషన్లలో క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపు సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. ఆటోమెటిక్ టికెట్ వెండింగ్ మేషిన్(ఏటీవీఎం)లోని క్యూఆర్ కోడ్ ద్వారా అన్‌రిజర్వ్‌డ్, ప్లాట్‌ఫాం టికెట్ల కొనుగోలు చేసే విధానం రెండేళ్లుగా అమలులో ఉంది. తాజాగా యూటీఎస్(జనరల్ బుకింగ్) కౌంటర్లలోనూ ఈ సదుపాయం కల్పించడం విశేషం.

సీఎంను కలిసిన చల్లా నర్సింహారెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డికి శాలువ కప్పి శుభాకాంక్షలు తెలుపుతున్న చల్లా నర్సింహారెడ్డి

రంగారెడ్డి అర్బన్, మార్చి 21 : డీసీసీ అధ్యక్షుడు, పట్టణ మౌలిక సదుపాయాల ఆర్థిక సంస్థ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో కలిశారు. ఇటీవల చల్లాను చైర్మన్‌గా నియమించిన సందర్భంగా ఆయన సీఎంకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి కట్టబెట్టిన పదవికి న్యాయం చేస్తానని చల్లానర్సింహారెడ్డి చెప్పారు. సీఎంను కలిసిన వారిలో మీర్‌పేట్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ చల్లా కవితాబాల్‌రెడ్డి, కార్పొరేటర్ సిద్దాల మౌనికశ్రీశైలం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చల్లా శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, పి. శేఖర్‌రెడ్డి, మురళీగౌడ్, విజయ్‌రెడ్డి, సుభాష్ రెడ్డి, కీసరి యాదిరెడ్డి, పరుశురాం తదితరులున్నారు.



సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి

కొడంగల్, మార్చి 21: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి బుధవారం రాత్రి హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తనను రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించిన సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే తనకు సముచిత స్థానం కల్పించడం పట్ల గురునాథ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

▸ టీఎస్ఆర్టీసీ ఎండీ సీవీ సజ్జనార్



సదస్సును ప్రారంభిస్తున్న టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్

ఘట్‌కేసర్, మార్చి 21: యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని టీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ అన్నారు. ఘట్‌కేసర్ మండలంలోని చౌదరిగూడలో గల నల్ల నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన టెక్ అండ్ ఫార్మా సంప్రతి 2024 సదస్సును ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అనేక మంది యువకులు నిత్యం జరిగే ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రధానంగా బైక్ నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలని, నిబంధనలు ఉన్నప్పటికీ అనేక మంది పాటించకుండా ప్రమాదాలకు గురవుతున్నారని గుర్తుచేశారు. యువత ప్రాణాలు కోల్పోతే ఆ కుంటుంబాలు ఎంతో ఇబ్బంది పడాల్సి వస్తుందని గుర్తుచేశారు. విద్యార్థులు పట్టుదలతో కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళ్లాలన్నారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. నేడు యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి ఎంతో విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని, వ్యసనాలకు గురికాకుండా ఉండాలన్నారు. విద్యార్థులు కొత్తకొత్త ఆవిష్కరణకు శ్రీకారం చుట్టి సమాజాభివృద్ధికి పాటుపడాలన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు 18 కళాశాలలకు చెందిన 2వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేస్తున్నట్లు కళాశాల ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘు రామారావు, కళాశాల చైర్మన్ నల్ల నర్సింహారెడ్డి, డైరెక్టర్ కృష్ణారెడ్డి, వైస్‌చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, ఆయా విభాగాల డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వృద్ధిరేటు సాధించాల్సిందే..!

▸ లేదంటే మున్సిపాలిటీలకు కేంద్ర గ్రాంట్ బంద్

▸ పన్నువసూళ్లలో వెనుకబడిన నాలుగు మున్సిపాలిటీలు

▸ సగటు వృద్ధి రేటు 11.93శాతం

▸ పూర్తిగా వెనుకంజలో తాండూరు మున్సిపాలిటీ



తాండూరు, మార్చి 21: మున్సిపాలిటీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సంఘం నిధులు రావాలంటే ఆస్తిపన్ను వసూళ్లను మెరుగుపర్చుకోవాల్సి ఉంది. 15వ ఆర్థికసంఘం నిధులను పొందేందుకు మున్సిపాలిటీలు గత ఆర్థిక సంవత్సరంతో పోల్చినప్పుడు ఆస్తిపన్ను వసూళ్లలో స్థిరమైన మెరుగుదల చూపాలని, సాధారణ సగటు వృద్ధిరేటుకు మెరుగుదల ఉండాలని రాష్ట్ర అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్రం ఈ వృద్ధి రేటు ఐదు సంవత్సరాల సగటు వృద్ధిరేటు పరిణామంలోకి తీసుకుంటుంది. 2018-19 నుంచి 2022-23 సంవత్సరం వరకు సగటు వృద్ధిరేటును తీసుకుంటుంది. ఈ లెక్కన రాష్ట్ర సగటు వృద్ధి రేటు 11.93శాతంగా నిర్ధారించారు. ఈ మేరకు వికారాబాద్ జిల్లా లోని నాలుగు మున్సిపాలిటీలు 2023-24 ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు 11.93శాతం సాధించాల్సిందే. లేదంటే కేంద్రప్రభుత్వం విడుదల చేసే గ్రాంట్స్‌ను అన్నింటినీ నిలిపివేస్తుంది. జిల్లాలో వృద్ధిరేటు సాధించడంతో జిల్లాలోనే ముందంజలో ఉన్న తాండూరు మున్సిపాలిటీ ఈ ఏడాదిఆస్తిపన్ను వసూళ్లలో రెవెన్యూ విభాగం నిర్లక్ష్యం కారణంగా వెనుకబడి పోయిందని చెప్పవచ్చును. వికారాబాద్, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలు దగ్గరలో ఉన్నాయి.

మున్సిపాలిటీ	2022-23 ఆస్తిపన్ను వసూళ్లు రూ. కోట్లలో	2023-24 ఆస్తిపన్ను వసూళ్లు రూ. కోట్లలో	పీటీ గ్రోంత్ రేటు	గోల్ సాధించడానికి వసూలు చేయాల్సిన ఆస్తిపన్ను రూ. కోట్లలో
వికారాబాద్	356.56	295.12	-17.23	103.98
తాండూరు	410.65	279.98	-31.82	179.66
పరిగి	138.85	119.53	-13.91	35.88
కోడంగల్	94.59	92.48	-2.23	12.47

అక్రమ కట్టడాలపై నోటీసులతోనే సరి

▸ రాజకీయ ఒత్తిళ్లతో చర్యలకు అధికారుల వెనుకంజ

▸ కోర్టులను ఆశ్రయిస్తున్న ఫిర్యాదుదారులు



తాండూరు, మార్చి 21: తాండూరులో అక్రమ నిర్మాణాలపై అధికార పార్టీకి చెందిన రాజకీయపార్టీల నేతల జోక్యంతో బల్దియా అధికారులు చర్యలు తీసుకోనేందుకు జంకుతున్నారు. అక్రమ నిర్మాణాలపై స్వయంగా మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టడం లేదు. తమ వార్డులో అక్రమ నిర్మాణం జరుగుతుందని వార్డు కౌన్సిలర్ సాహు శ్రీలత చేసిన ఫిర్యాదుపై శివాజీచౌక్‌లో అక్రమ నిర్మాణం దారులకు బల్దియా అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు. శాంతినగర్‌లో నిర్మిస్తున్న మూడు అంతస్థుల భవనం నిర్మాణంపై ఇప్పటికే మాజీ కౌన్సిలర్ అనురాధ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. శివాజీ చౌక్‌లో దుకాణాల సముదాయం నిర్మాణాలపై కౌన్సిలర్ సాహు శ్రీలత కోర్టును ఆశ్రయించారు. కొడంగల్ రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జికింద నాలాపక్కనే రెండవ ఫ్లోర్ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించినా చర్యలు చేపట్టలేదు.

రెవెన్యూ ఇక్కడ.. పీఎస్ అక్కడ..!



పోలీస్‌స్టేషన్ కోసం సిద్ధం చేసిన పంచాయతీ భవనం

కులకచర్ల, మార్చి 21: జిల్లాల పునర్విభజనలో భాగంగా చౌడాపూర్ మండలం రెండు ముక్కలైందని గ్రామస్తులు అంటున్నారు. ఇక్కడ రెవెన్యూ పరిధి చౌడాపూర్ మండలం, పోలీస్‌స్టేషన్ మహబూబ్‌నగర్ నవాబుపేట మండలంలో ఉన్నాయి. దీంతో మరికల్, కొత్తపల్లి, కల్మన్‌కాల్వ, చాకల్‌పల్లి, పురసంపల్లి, కిష్టంపల్లి, మల్కాపూర్, బంగరంపల్లి గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పోలీస్‌స్టేషన్‌ను తిరిగి కులకచర్ల పీఎస్‌కు మార్చాలని ఆయాగ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఈపరిస్థితి నెలకొందని వాపోతున్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు జిల్లాల పునర్విభజనలో భాగంగా ఆయాగ్రామాలు మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలంలో విలీనమయ్యాయి. చౌడాపూర్‌ను కొత్త మండలంగా ఏర్పాటు చేయగా ఆ గ్రామాలు అందులోకి వచ్చాయి. పీఎస్ మార్చకపోవడంతో అప్పట్లో అధికారులు చేసిన తప్పిదాలకు గ్రామస్థులు ఇప్పుడు నానా అవస్థలు పడుతున్నారు. చౌడాపూర్ మండలంలో గల మరికొన్ని గ్రామాలు కులకచర్ల పీఎస్ పరిధిలో కొనసాగుతున్నాయి. చౌడాపూర్‌లో పీఎస్ ఏర్పాటు కావడం లేదు. పీఎస్ ఏర్పాటుతో పాటు నవాబుపేట పీఎస్ పరిధిలో ఉన్న గ్రామాలను చౌడాపూర్‌లో మారుస్తారని నూతన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు గంపెడాశలతో ఎదురు చూస్తున్నారు.



యాచారం బస్టాండ్‌లో బస్సును తనిఖీ చేస్తున్న డిపో మేనేజర్ రాజీవ్‌ప్రేమ్‌కుమార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బస్సులు ఆపకపోతే కఠిన చర్యలు

▸ బస్సులను తనిఖీ చేసిన డీఎం

యాచారం, మార్చి 21 : యాచారం బస్టాండ్‌లో దేవరకొండ డిపోకు చెందిన బస్సులను ఆపకపోతే శాఖా పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని డ్రైవర్, కండక్టర్లను ఆ డిపో మేనేజర్ రాజీవ్‌ప్రేమ్‌కుమార్ హెచ్చరించారు. యాచారంలో ఆగని దేవరకొండ డిపో బస్సులు అనే శీర్షికన ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. యాచారం బస్టాండ్‌లో దేవరకొండ డిపోకు చెందిన బస్సులను ఆయన గురువారం తనిఖీ చేశారు. స్వయంగా ప్రయాణికులతో మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. బస్సులు ఆపకపోతే తనకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. యాచారం బస్టాండ్‌లో తాత్కాలికంగా ఓ కంట్రోలర్‌ను నియమించారు.

నూతన ఆవిష్కరణలకు జీవం

▸ సీవీఆర్ కళాశాలలో ఉత్సాహంగా ప్రారంభమైన సియన్‌సియా-2024



మాట్లాడుతున్న డీఆర్‌డీఎల్ డైరెక్టర్ బాల మురళి కృష్ణన్

ఆదిభట్ల, మార్చి 21 : విద్యార్థులు ప్రాజెక్టు వర్క్‌లు చేసేటప్పుడు మూస పద్ధతులకు పోకుండా వినూత్నంగా ఆలోచించాలని, అప్పుడే నూతన ఆవిష్కరణలకు జీవం పోయగలమని డీఆర్‌డీఎల్ సంస్థ హైదరాబాద్ డైరక్టర్ డాక్టర్ బాల మురళి కృష్ణన్ విద్యార్థులకు సూచించారు. ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే సియన్‌సియా-2024 గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బాల మురళి కృష్ణన్, కళాశాల చైర్మన్ డాక్టర్ రాఘవ వి చెరబుడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే.రామ్మోహన్ రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వళన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినూత్నంగా ఆలోచించినప్పుడే పోటీ ప్రపంచంలో సక్సెస్ కాగలమన్నారు. రక్షణ రంగం, ఏరోస్పేస్ విభాగాల్లో కూడా విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలని అన్నారు. విద్యార్థుల ఆవిష్కరణలు వివిధ రంగాల అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని చెప్పారు. తమ కళాశాల 23 సంవత్సరాల్లో సాధించిన ప్రగతిని కళాశాల చైర్మన్ డాక్టర్ రాఘవ వి చెరబుడ్డి వివరించారు. ఫలితాల ఆధారిత విద్య ప్రాధాన్యతను ప్రిన్సిపాల్ డాక్టర్ కే. రామ్మోహన్‌రెడ్డి వివరించారు. మెషిన్ లెర్నింగ్ అప్లికేషన్స్ ఫర్ ఇంజనీర్స్ వర్క్‌షాప్, వెబ్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్, వర్క్‌షాప్ ఆన్ లింక్డ్ ఇన్ అండ్ రెజ్యూమ్ బిల్డింగ్, లాంగ్ చైన్ వర్క్‌షాప్ లాంటి కార్యక్రమాలు మొదటి రోజు జరిగాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శివారెడ్డి, ప్లేస్‌మెంట్ అధికారి విజయమేర్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు


ధారూరు: ధారూరు సమీపంలో దెబ్బతిన్న కల్వర్టు

ధారూరు, మార్చి 21: ధారూరు గ్రామం నుంచి మండల పరిషత్తు కార్యాలయానికి వెళ్లే రోడ్డులో కల్వర్టు దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు వరద నీటి తాకిడితో ఈ కల్వర్టుకు ఉన్న రాళ్లు పెకిలించుకుపోయాయి. కల్వర్టులో సగ భాగం రాళ్లు పైకితేలాయి. దీంతో ధారూరు నుంచి అటువైపు ఉన్న వివిధ గ్రామాలకు వెళ్లే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు రాకపోకలు సాగించే ఈ రోడ్డు పైన పాడైన కల్వర్టు మరమ్మతులకు నోచుకోవటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎలక్ట్రానిక్ రంగంలో ఉజ్వల భవిష్యత్తు


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఐఈటీఈ హైదరాబాద్ కార్యదర్శి నులి నమశ్శివాయ

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 21: విద్యార్థులకు ఎలక్ట్రానిక్ రంగంలో ఉజ్వల భవిష్యత్తు ఉందని ఐఈటీఈ హైదరాబాద్ కార్యదర్శి నులి నమశ్శివాయ అన్నారు.. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో గురువారం ఆయన ఐఈటీఈ స్టూడెంట్ ఫోరంను ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాక్ట్రానిక్స్ విభాగంలో విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. విజ్ఞాన మార్పిడి పెంపొందించుకోవాలని సూచించారు. ఐఈటీఈ స్టుడెంట్ ఫోరంకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉందని, ఇది విద్యార్థులకు వేదిక కానుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐఈటీఈ కోశాధికారి డాక్టర్ ఎన్.శ్రీనివాస్‌రావు, అనురాగ్ యూనివర్సిటీ డీన్‌లు విజయకుమార్, శ్రీనివాస్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పార్కింగ్ చేసి ఉన్న టిప్పర్లలో డీజిల్ చోరీ


పార్కింగ్‌లో ఉన్న టిప్పర్లు

మేడ్చల్ టౌన్, మార్చి 21: పట్టణంలోని జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీ టిప్పర్లలో డీజిల్‌ను చోరీచేశారు. వాహనాల యజమానులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్‌లోని హోండా షోరూమ్ సమీపంలో ఎనిమిది టిప్పర్లు రోజూమాదిరిగా బుధవారం రాత్రి పర్కింగ్ చేసి ఉంచారు. గుర్తుతెలియని దుండగులు టిప్పర్ డిజిల్ ట్యాంకు మూతలు తొలగించి డిజిల్ దొంగలించారు. వాహనాల్లో దాదాపు రూ.2లక్షలు విలువ గల డీజిల్ చోరీ అయిందని టిప్పర్ల యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయాలపాలైన జంగ్యానాయక్

కులకచర్ల, మార్చి 21: లారీ ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండల కేంద్రంలోని చౌరస్తాలో గురువారం పరిగి నుంచి చౌడాపూర్‌కు రేషన్ బియ్యం తీసుకెళ్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న బోట్యనాయక్ తండాకు చెందిన జంగ్యానాయక్ రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంలో పరిగి ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో డ్రైవర్ లారీని అక్కడే వదిలిపారి పోయాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

యువతి అదృశ్యం


మౌనిక

పరిగి, మార్చి 21: ఇంటి నుంచి బయలుదేరిన యువతి అదృశ్యమైంది. మండలంలోని నస్కల్ గ్రామానికి చెందిన మౌనిక(18 సంవత్సరాలు), ఇంటర్ పూర్తి చేసి ఇంటి దగ్గరే ఉంటోంది. ఈనెల 20వ తేదీన బుధవారం గ్రామంలోనే స్నేహితురాలి పెళ్లికి వెళ్లింది. తిరిగి ఇంటికిరాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె స్నేహితులు, బంధువులను ఆరాతీశారు. అయినా ఆమె ఆచూకీ తెలియలేదు. దీంతో వారు పోలీసులను ఆశ్రయించారు. మౌనిక తల్లి యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

అర్ధరాత్రి చోరీకి యత్నం.. పట్టుబడిన దొంగ


దొంగతనానికి యత్నించి పట్టుబడిన యువకుడు

కొడంగల్, మార్చి 21: కొడంగల్ మున్సిపల్ పరిధిలోని సన్‌సిటీ కాలనీలో బుధవారం రాత్రి దొంగతనానికి యత్నించి పట్టుబడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కాలనీలో బుధవారం సాయంత్రం ఓ యువకుడు సంచరిస్తూ ఇళ్లను పరిశీలించి వెళ్లిపోయాడు. బుధవారం అర్ధరాత్రి కాలనీకి చెందిన గోపాల్ ఇంటి ముందున్న శునకం అరవడంతో కాలనీలోని పలు ఇళ్లలో నుంచి ప్రజలు బయటకు వచ్చి గమనించారు. అప్పటికే పొదల చాటున దాక్కున్న ఓ యువకున్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే కానిస్టేబుల్ షఫీ బైక్‌పై దొంగలను వెంబడించారు. అప్పటికే కానిస్టేబుల్ నరేందర్‌రెడ్డి, హరిలాల్‌లు లాఠీని వాహనంపై విసరగా దొంగల వాహనం అద్దాలు పగిలినా తప్పించుకున్నారు. ఎస్సై భరత్‌రెడ్డి సిబ్బందితో అంబేద్కర్ చౌరస్తాలో బందోబస్తు నిర్వహించినా ఫలితం లేకపోయింది. ఎస్ఐ భరత్‌రెడ్డి అక్కడికి వచ్చి ఆ యువకున్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై ఎస్ఐ భరత్‌రెడ్డికి సమాచారం అందించగా పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించగా పొదల చాటున ఓ దొంగ పట్టుబడ్డాడు. పట్టుబడిన దొంగతో ఎక్కడెక్కడ తిరిగారనే కోణంలో విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పట్టుబడిన దొంగ దగ్గర కర్నాటకకు సంబంధించిన ఆధారాలు లభించాయని తెలిపారు. సీసీ కెమెరాల సాయంతో వీలైనంత త్వరగా మిగతా వారిని పట్టుకుంటామన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం


కల్యాణోత్సవంలో పాల్గొన్న చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వెూమిన్‌పేట్: మండలంలోని వెల్చాల్‌లో గురువారం శ్రీలక్ష్మీ నర్సింహస్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణలతో స్వామివారి కల్యాణోత్సవంలో తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సమర్పించారు. మూడురోజుల పాటు స్వామివారి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. చేవేళ్ల మాజీ ఎంపీ, బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి కల్యాణోత్సవానికి హాజరై ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు ప్రతాప్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఇబ్రహిం, రాంచంద్రారెడ్డి, విజయేందర్‌రెడ్డి, కిరణ్, రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో మద్దతివ్వండి: ఈటల


మేడ్చల్‌లో ప్రముఖులను కలిసిన బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

మేడ్చల్ టౌన్, మార్చి 21: పార్లమెంట్ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని బీజేపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ కోరారు. మేడ్చల్ పట్టణంలోని పలువురు నేతల ఇంటికి ఆయన గురువారం వెళ్లి కలిశారు. మేడ్చల్ మాజీ సర్పంచ్ చీదు దేవందర్‌రెడ్డి, మురళీధర్‌గుప్త, మేడ్చల్ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్ నివాసానికి వెళ్లి ఈటల కలిశారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావడానికి ప్రతీఒక్కరు మద్దతు పలకాలన్నారు. ఈనెల 23న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు పెద్దఎత్తున తమ పార్టీలో చేరుతున్నారని కావున మేడ్చల్ పట్టణ నేతలూ పార్టీలోచేరి తమకు మద్దతివ్వాలని కోరారు. కాగా మాజీ సర్పంచ్ మురళీధర్ గుప్త ఈటలకు మద్దతివ్వడానికి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారెడ్డి నందారెడ్డి పాల్గొన్నారు.

మేకలను వేటాడుతున్న వీధికుక్కలు


ధారూరు: కుక్కలదాడిలో మృత్యువాతపడిన మేకలు

ధారూరు, మార్చి 21: ధారూరులో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. గ్రామంలో గుంపులు గుంపులుగా తిరుగుతూ మేకలను వేటాడుతుండటం కలవరపెడుతోంది. గ్రామంలో కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తూ మేకలను వేటాడి తినేస్తున్నాయి. పాకల వద్ద, ఇళ్ల వద్ద జాలీల్లో మేకలను సైతం వదలడంలేదు. రాత్రివేళలో కుక్కలు మేకలను వేటాడుతుండటంతో మేకల కాపరులు, పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల కిందట ధారూరుకు చెందిన మటన్ వ్యాపారి ఫెరోజ్ ఖురేషికి చెందిన ఎనిమిది మేకలను ఇంటి వద్ద కట్టేసి ఉంచాడు. ఈ క్రమంలో రాత్రి సమయంలో గుంపుగా వచ్చిన కుక్కలు ఏడు మేకలను చంపితిన్నాయి. మృత్యువాతపడిన మేకల విలువ సుమారు రూ.42వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. కాగా గ్రామంలో రోజురోజుకు కుక్కల సంఖ్య పెరగడంతో సమస్య మరింత తీవ్రమవుతోందిన మేకల పెంపకందారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మేకలను మేతకోసం బయటకు తీసుకెళ్లిని కుక్కలు వదలడంలేదని వాపోతున్నారు. వాటిని నిలువరించలేకపోతున్నామంటూ మేకల కాపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడవిలో తోడేళ్లలాగా గ్రామాల్లోని కుక్కలు విజృంభిస్తుండటంతో తాము ఆర్థికంగా నష్టపోతున్నామని తెలిపారు. అదేవిధంగా ఈ కుక్కలు స్థానికులపైనా దాడులు చేస్తున్నాయని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కుక్కల బెడదను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కుక్కల గుంపు మేకలపై దాడిచేసి చంపేసింది



ఇంటి సమీపంలో కట్టేసిన ఎనిమిది మేకలపై వారం రోజుల కిందట రాత్రి పూట కుక్కల గుంపు దాడి చేసి చంపేసింది. చుట్టూ ప్రహరీ ఉన్నప్పటికీ ప్రహరీని దాటుకుని ఎలా వచ్చాయో అర్థం కాలేదు. ఈదాడిలో ఏడు మేకలు మృత్యువాతపడగా ఒక మేక మిగిలింది. దాదాపు రూ.42వేల నష్టం వాటిల్లింది. మాంసం రుచి మరిగిన కుక్కలు మేకలను వేటాడుతున్నాయి. కుక్కల బెడదతో మేకలను పెంచాలంటేనే భయమేస్తోంది. స్థానికులపైనా దాడులు చేస్తున్నాయి.

-ఫెరోజ్ ఖురేషి, మటన్ వ్యాపారి, ధారూరు

ఐడీఎస్‌తో సేయింట్ పీటర్స్ ఒప్పందం


కార్యక్రమంలో సేయింట్ పీటర్స్ కళాశాల ప్రతినిధులు

మేడ్చల్ టౌన్, మార్చి 21: ప్రముఖ బహుళ జాతీయ పరిశ్రమ ఇన్‌ఫర్మేషన్, డేటా సిస్టం (ఐడీఎస్)తో గుండ్లపోచంపల్లి మైసమ్మగూడకు చెందిన సేయింట్ పీటర్స్ పరిశ్రమ గురువారం ఒప్పందాన్ని కదుర్చుకుంది. ఈమేరకు ఇరుసంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. బ్లాక్ చైనా, సైబర్ సెక్యూరిటీ, ఐటీ విభాగాల్లో విద్యార్థుల నైపుణ్యత విలువలను పెంపొందించటంతో పాటు ఇన్సెన్టీవ్ అవకాశాలు కల్పించడానికి ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీలత, అకాడమిక్ డైరెక్టర్ సరోజ రెడ్డి, అడ్మినిస్ట్రేటీవ్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి, కళాశాల కార్యదర్శి టీ.వి.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.76.38లక్షల దీర్ఘకాలిక రుణాలిచ్చాం


చెక్కులను అందజేస్తున్న సొసైటీ చైర్మన్, బ్రాంచ్ మేనేజర్

బషీరాబాద్. మార్చి 21: నవాంద్గీ సొసైటీ ద్వారా 19మంది రైతులకు రూ.76.38లక్షల దీర్ఘకాలిక రుణాలిచ్చినట్లు ఆ సంఘం చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి తెలిపారు. డీసీసీబీ బ్యాంక్ తాండూరు బ్రాంచ్ కార్యాలయంలో గురువారం రైతుల రుణాలకు సంబంధించిన చెక్కులను ఆ బ్యాంక్ మేనేజర్ ఎం.మనోహర్ రావుతో కలిసి ఆయన అందజేశారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ హైదరాబాద్ సహకారంలో ఈ రుణాలను రైతులకు అందజేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో రైతుల సంక్షేమానికి మరిన్ని రుణాలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో బందెయ్యగౌడ్, అధికారి సి.రాజశేఖర్ పాల్గొన్నారు.

పేదలకు వైద్యసేవలందించడమే ధ్యేయం


ఉచిత హెల్త్ క్యాంప్‌లో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

శామీర్‌పేట, మార్చి 21: మారుమూల గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న పేదలను చేరదీసి అందుబాటులో వైద్యసేవలను అందించడమే మెడిసిటీ ఆస్పత్రి వారి ధ్యేయమని ఆ ఆస్పత్రి డాక్టర్ అభిషేక్ అన్నారు. శామీర్‌పేట మండలం లాల్‌గడి మలక్‌పేట గ్రామంలో గురువారం మెడిసిటీ ఆస్పత్రి వారు పెద్దఎత్తున ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో మెడిసిటీ డాక్టర్లు అభిషేక్, ఓమార్, వైభవి, దివ్య, సిమ్రాన్, వైద్య సిబ్బంది, రోగులను పరీక్షించి వివిధ రకాల మందులను అందజేశారు. అదేవిధంగా రోగులకు బీపీ, షుగర్, థైరాయిడ్, చెవి, ముక్కు, గొంతు, గడ్డలు, కుటుంబ నియంత్రణ, తదితర పరీక్షలను చేశారు. ఈ శిబిరంలో 132 మంది రోగులకు వైద్యులు షుగర్, బీపీ టెస్టులను చేశారు. దాదాపు 200మంది రోగులను వైద్యులు పరీక్షించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడిసిటీ మార్కెటింగ్ ఇన్‌చార్జి కుమారస్వామి, నాగార్జున, పూజ, తదితర సిబ్బంది పాల్గొని రోగులకు వైద్య సేవలను అందించారు.

ఇందిరమ్మ కాలనీలో కార్డన్ సెర్చ్


ఇందిరమ్మ కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

యాలాల,: మార్చి 21: తాండూరు హైదరాబాద్ రోడ్డు మార్గంలో గల ఇందిరమ్మ కాలనీలో డీఎస్పీ ఆధ్వర్యంలో గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇందిరమ్మ కాలనీలో ప్రతీ ఇంటిని తనిఖీ చేశారు. అను మతులు లేని 28 బైకులను, 10 ఆటోలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ బాలకృష్ణరెడ్డి మాట్లాడుతూ కాలనీలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా సంబంధిత పత్రాలను కలిగి ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో ఎవరైనా కొత్త వ్యక్తులు కాలనీలోకి వస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐలు సంతోష్, అశోక్, యాలాల ఎస్ఐ శంకర్, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

ఆర్ట్స్ విభాగంలో దరఖాస్తుల స్వీకరణ

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 21: మండలంలోని అంకుషాపూర్ ప్రిన్సిటన్ కళాశాలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఇబ్రహీపట్నం ఆర్ట్స్ విభాగంలో 2024-2025 విద్యాసంవత్సరానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ రాధిక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన వారితో పాటు ఇంటర్మీడియెట్ పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చిని సూచించారు. బీఏ విభాగాల్లో హెచ్‌ఈపీ (హిస్టరీ ఏకనామిక్స్ పొలిటికల్ సైన్స్), బీఏ హెచ్‌ఈపీఏ (హిస్టరీ, ఎకనామిక్స్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) బీఏ ఈపీఎస్ (ఎకనామిక్స్ పొల్టికల్ సైన్స్ సోషాలజీ), బీఏ ఈపీపీ (ఎకనామిక్స్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఫిలాసఫీ), బీఏ ఈఐఆర్‌పీ (ఎకనామిక్స్ ఇంటర్‌నేషనల్ రిలేష న్స్ పొల్టికల్ సైన్స్), బీఏ పీఈజే (పబ్లిక్ పాలసీ ఎకనామిక్స్ జర్నలిజం), బీఏ ఈపీజీ (ఎకనామిక్స్ పొల్టికల్ సైన్స్ జియాలజీ) లకు వచ్చేనెల 12లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 28న పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు వినియోగించుకోవాలన్నారు.

నీటి పొదుపుగా వాడాలి


మట్లాడుతున్న ప్రొఫెసర్ రాజ్‌కుమార్

మేడ్చల్ టౌన్, మార్చి 21: నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడాలని ప్రొఫెసర్ రాజ్‌కుమార్ అన్నారు. గండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ పోలీసు శిక్షణ కేంద్రంలో గురువారం శాంతి కోసం నీరు అనే అంశంపై శిక్షణ పొందుతున్న పోలీసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. వర్చువల్ వాటర్ ప్రాధాన్యత, నీటి వినియోగం, లభ్యత, పొదుపు, నీటి వినియోగ విధానాలపై అవగాహన కల్పించారు. మనుగడ సాగించడానికి నీటి ప్రాముఖ్యత గురించి తెలిపి నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీసు శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ వేంకటేశ్వరావు, ప్రొఫెసర్ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న తహసీల్దార్

బషీరాబాద్, మార్చి 21: బషీరాబాద్ రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ వై.వెంకటేష్ అర్హులైన లబ్ధిదారులకు గురువారం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఐదుగురు లబ్ధిదారులకు చెక్కులు మంజూరు కాగా ఆయన స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికార సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎన్నికల సెక్టోరియల్ అధికారి


కులకచర్లలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సెక్టోరియల్ అధికారి మహేశ్

కులకచర్ల, మార్చి 21: రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కులకచర్లలోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సెక్టోరియల్ అధికారి మహేశ్ పరిశీలించారు. కులకచర్లలో పోలింగ్ కేంద్రాలు 141, 148లలో గురువారం వసతులు, సౌకర్యాలను పరిశీలించారు. కేంద్రాల్లో విద్యుత్, వెలుతురు, గాలి, నీటి సౌకర్యం ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అన్వేష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మూడుచింతలపల్లి, మార్చి 21: ఉచిత కంప్యూటర్ శిక్షణ శిబిరాన్ని యువతీయువకులు వినియోగించుకోవాలని శ్రీబాలాజీ జూనియర్ కళాశాల యాజమాన్యం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు 10వ తరగతి చదివిన నిరుద్యోగ యువత అయి ఉండాలన్నారు. ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాల కోసం 9542517118 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

జానపద కళాకారుడికి సూర్యపర్వ్ అవార్డు


అయోధ్యలో సూర్యపర్వ్ అవార్డు అందుకుంటున్న జానపద కళాకారుడు ప్రకాశ్

కొడంగల్ రూరల్, మార్చి 21: కొడంగల్ మండలంలోని చిట్లపల్లి గ్రామానికి చెందిన జానపద కళాకారుడు ప్రకాశ్‌ను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సెంట్రల్ కల్చరల్ టీం లీడర్‌గా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా అయోధ్యలో జరిగిన కార్యక్రమంలో శ్రీసీతారామ సన్నిధిలో సూర్యపర్వ్ అవార్డుతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యపర్వ్ కార్యక్రమంలో భాగంగా దేశంలోని 18 రాష్ట్రాల నుంచి 250మంది కళాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రం నుంచి కళారీ (కర్రసాము) ప్రదర్శనలో కొడంగల్‌కు చెందిన రమేశ్ బృందం పాల్గొనగా జ్ఞాపికలతో సన్మానించినట్లు తెలిపారు. కొడంగల్ ప్రాంత జానపద కళాకారుడికి అవార్డుతో సన్మానించడం పట్ల నియోజకవర్గ ప్రజలు అభినందనలు తెలిపారు.

రేపు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

పరిగి, మార్చి 21: ఈనెల 23న (రేపు)పరిగిలోని ఎస్ గార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం జరుగుతుందని పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, జిల్లా పార్టీ అధ్యక్షుడు ఎం.ఆనంద్, ఎమ్మెల్యేలు పి.సబితారెడ్డి, కాలే యాదయ్య, ప్రకాశ్ గౌడ్, గాంధీ, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు. పార్టీ అధ్యక్ష కార్యదర్శులు,నాయకులు కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి


కులకచర్ల పంచాయతీలో పన్నులు వసూలు చేస్తున్న కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

కులకచర్ల, మార్చి 21: ప్రజలు పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని కులకచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం పంచాయతీలో ప్రజల నుంచి వివిధ రకాల పన్నులను వసూలు చేశారు. ఇంటి పన్ను, ఇతర పన్నులు చెల్లించాలని తెలిపారు. గ్రామ పరిధిలో వంద శాతం అన్ని రకాల పన్నులు వసూలు చేస్తామని తెలిపారు. ప్రజలు అన్ని రకాల పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని తెలిపారు.